RNI: APTEL/2013/54506

# నేటి ప్రస్థానం

తెలుగు దినపత్రిక




హైదరాబాద్ | బుధవారం 17-6-2026 | సంచిక: 13 | సంఖ్య: 260 పేజీలు: 4 | వేలు: 5/- | ఎడిటర్: సందీప్ గౌడ్ వి

# SIRపై సీఎం రేవంత్ సీరియస్..

- SIR ప్రక్రియపై పార్టీ శ్రేణులకు సీఎం రేవంత్ కీలక ఆదేశాలు
- వలస ఓటర్ల వివరాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచన
- ప్రతి బూత్‌లో దీూలతో సమన్వయం చేసుకోవాలని పిలుపు
- గాంధీ భవన్‌లో వార్ రూమ్.. జిల్లా వారీగా మానిటరింగ్

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియపై తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ నిర్వహించిన జూమ్ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పార్టీ శ్రేణులకు అత్యంత కీలకమైన ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలో ఉన్న మొత్తం ఓట్లలో మెజారిటీ శాతం ఓట్లను ఏదో ఒక కారణంతో పక్కన పెట్టారని, 'అనుమానాస్పదం' అనే నెపంతో వాటిని తొలగించే పెద్ద ప్రయత్నం జరుగుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. 2028లో జరగబోయే అసెంబ్లీ ఎన్నికలకు ఈ 2026 అక్టోబరులోనే ఓటర్ల జాబితా దాదాపు ఫైనల్ అవుతుందని గుర్తుచేసిన సీఎం.. ఒకసారి ఓట్లు తొలగిపోతే భవిష్యత్తులో మనం చేసేదేమీ ఉండదని, ఇది రాజకీయంగా అత్యంత ప్రమాదకరమైన సందర్భమని పార్టీ నాయకులను హెచ్చరించారు.

**వలస ఓటర్లపై ప్రత్యేక నిఘా.. బూత్ స్థాయి అనుసంధానం**

రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లోని ప్రతి గ్రామంలో, ప్రతి పోలింగ్ బూత్ పరిధిలో ప్రభుత్వ బూత్ లెవెల్

- మిగతా 2వ పేజీలో



## ఐఆర్ఎఫ్‌సీ రుణాలకు సాంకేతిక ఇబ్బందులున్నాయి

- తెలంగాణ అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉందన్న కిషన్‌రెడ్డి
- మెట్రో విస్తరణకు సహకరిస్తున్నామని వ్యాఖ్య
- అభివృద్ధిపై తమకు పాఠాలు చెప్పాల్సిన అవసరం లేదన్న కేంద్ర మంత్రి
- తాను చెబితే ప్రాజెక్టులు ఆగవన్న కిషన్‌రెడ్డి
- దిగజారుడు రాజకీయాలు చేయొద్దంటూ విమర్శలు

2లో





2లో

## కేంద్ర జలశక్తి మంత్రితో పవన్ భేటీ..

- 'సూరత్ నమూనా'పై కీలక చర్చ!
- సీఆర్ పాటిల్ తో పవన్ కల్యాణ్ భేటీ
- రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో నీటి కొరత తీరలేదని చెప్పిన పవన్
- నదీ జలాల స్వచ్ఛతపై దృష్టి పెట్టాలని అధికారులకు సూచన



## జులై మూడో వారంలో 'తల్లికి వందనం'..

2లో

- విద్యాశాఖ అధికారులతో మంత్రి లోకేశ్ సమీక్ష
- వచ్చే నెలలో 'తల్లికి వందనం' పథకం అమలుకు చర్యలు
- ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెంచాలని మంత్రి లోకేష్ ఆదేశం
- జూన్ 29న షైనింగ్ స్టార్స్, జులైలో మెగా పీటీఎం నిర్వహణకు నిర్ణయం
- వివిధ 'సెట్'లను సకాలంలో నిర్వహించాలని ఉన్నత విద్యాశాఖకు సూచన
- ఏపీకి ఎన్‌సీసీ స్టేట్ డైరెక్టరేట్ మంజూరు చేసిన కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు

### పిల్లల గుడ్లు, పప్పుల్లో రూ. 2 వేల కోట్ల స్కామ్..

## రేవంత్ అన్నదమ్ములే కోటీశ్వరులయ్యారంటూ హరీశ రావు ఫైర్!

- గురుకుల పాఠశాలల్లో భారీ కుంభకోణం జరిగిందన్న హరీశ్
- తమ శాఖల్లో ఏం జరుగుతోందో కూడా తెలియని స్థితిలో మంత్రులు ఉన్నారని ఎద్దేవా
- పిల్లలకు ఇచ్చే గుడ్లు, పప్పుల్లో కూడా స్కామ్ చేస్తారా అని మండిపాటు



తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం టార్గెట్‌గా బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణులు విమర్శల డోస్ పెంచాయి. తాజాగా జరిగిన బీఆర్‌ఎస్ డిజిటల్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులను లక్ష్యంగా చేసుకుని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గురుకుల పాఠశాలల టెండర్లలో ఏకంగా రూ. 2,000 కోట్ల భారీ కుంభకోణం జరిగిందని ఆయన సంచలన ఆరోపణలు చేశారు.

## అమెరికా-ఇరాన్ ఒప్పందంలో తెరవెనుక చక్రం తిప్పిన ఖతార్!

- అమెరికా, ఇరాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం
- ఒప్పందం వెనుక కీలక పాత్ర పోషించిన ఖతార్
- తిరిగి ప్రారంభం కానున్న హర్మూజ్ జలసంధి రవాణా
- జెనీవాలో ఒప్పందంపై అధికారికంగా సంతకాలకు సన్నాహాలు
- ప్రారంభ దశలో మధ్యవర్తిత్వం నెరిపిన పాకిస్థాన్

2లో

## భారత్‌లో యాప్‌పై ఆంక్షలు..

- నీట్ రీ-ఎగ్జామ్ నేపథ్యంలో టెలిగ్రామ్‌పై తాత్కాలిక నిషేధం
- చీటింగ్, తప్పుడు ప్రచారాలను అరికట్టేందుకే ఈ నిర్ణయం
- జూన్ 21న దేశవ్యాప్తంగా నీట్-యూజీ పునఃపరీక్ష
- కేంద్రం చర్యను తప్పుబట్టిన టెలిగ్రామ్ సీఈవో పావెల్ దురోవ్
- ప్లే స్టోర్ నుంచి టెలిగ్రామ్ యాప్‌ను తొలగించిన గూగుల్





# స్వర్ణాంధ్ర 2047 విజన్‌తో ముందుకు ఏపీ..

- సింగపూర్ సమ్మిట్‌లో అమరావతి బ్రాండింగ్.. చంద్రబాబు కీలక ప్రసంగం
- సింగపూర్‌లో వరల్డ్ సిటీస్ సమ్మిట్‌లో ప్రసంగించిన సీఎం చంద్రబాబు
- సరికొత్త ఆలోచనలతో అమరావతికి రావాలని పెట్టుబడిదారులకు ఆహ్వానం
- అభివృద్ధికి, సంపద సృష్టికి సైబరాబాద్ నిదర్శనమని వ్యాఖ్య
- ప్రజా రాజధానిగా అమరావతిని ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దుతామని వెల్లడి
- సింగపూర్ ఇన్నోవేషన్, టెక్నాలజీ ప్రదర్శన స్టాళ్లను సందర్శించిన ముఖ్యమంత్రి
- విశాఖ సదస్సుకు సన్నాహకంగా సింగపూర్‌లో బిజినెస్ రోడ్ షో
- పెట్టుబడులకు ఏపీ అత్యంత సురక్షితమైన ప్రాంతమని వెల్లడి
- భారత్‌కు ఏపీ ఎకనమిక్ పవర్‌హౌస్‌గా మారుతుందని ధీమా

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిని అవకాశాల గనిగా అభివర్ణించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, సరికొత్త ఆలోచనలతో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని అంతర్జాతీయ సమాజానికి పిలుపునిచ్చారు. సింగపూర్‌లో జరుగుతున్న 'వరల్డ్ సిటీస్ సమ్మిట్'లో భాగంగా తన పర్యటన రెండో రోజు ఆయన 'కెన్ స్మార్ట్ సిటీస్ లవ్ హ్యూమన్స్' అనే అంశంపై ప్లీనరీలో ప్రసంగించారు. అమరావతిని ఒక ప్రజా రాజధానిగా, ప్రపంచంలోనే అత్యుత్తమ నగరాల్లో ఒకటిగా తీర్చిదిద్దుతున్నామని చంద్రబాబు స్పష్టం చేశారు. అమరావతిని కేవలం పరిపాలనా నగరంగా కాకుండా, ఒక నాలెడ్జ్ సిటీగా తీర్చిదిద్దుతున్నామని, ఇప్పటికే పలు జాతీయ, అంతర్జాతీయ విద్యాసంస్థలు వస్తున్నాయని చంద్రబాబు వివరించారు. క్రీడలు, ఆర్థిక, విజ్ఞానం, న్యాయ, పర్యాటక, ఆరోగ్యం,

- మిగతా 2వ పేజీలో

# భారత్‌లో యాప్‌పై ఆంక్షలు..

నీట్-యూజీ 2026 పునఃపరీక్షను అత్యంత పకడ్బందీగా నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా ప్రముఖ మెసేజింగ్ యాప్ టెలిగ్రామ్‌పై దేశవ్యాప్తంగా జూన్ 22 వరకు తాత్కాలిక ఆంక్షలు విధించింది. పరీక్ష సమయంలో చోటుచేసుకునే అక్రమాలను, తప్పుడు ప్రచారాలను అరికట్టడమే లక్ష్యంగా ఈ చర్యలు చేపట్టింది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) సిఫార్సు మేరకు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టంలోని సెక్షన్ 69ఏ కింద ఈ ఆదేశాలు జారీ అయ్యాయి. కేంద్ర ప్రభుత్వ నిర్ణయంపై టెలిగ్రామ్ సీఈఓ పావెల్ దురోవ్ స్పందించారు. కొందరు చేసే తప్పులకు భారత్‌లోని 150 మిలియన్ల మంది సాధారణ వినియోగదారులను శిక్షించడం సమంజసం కాదని ఆయన 'ఎక్స్' వేదికగా విమర్శించారు. ఈ నిషేధం వల్ల ఆశించిన ప్రయోజనం ఉండదని, లీకేజీలకు పాల్పడేవారు ఇతర ప్రత్యామ్నాయ మార్గాలను ఆశ్రయిస్తారని ఆయన అభిప్రాయపడ్డారు. కాగా, ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా గూగుల్ ఇప్పటికే తన ప్లే స్టోర్ నుంచి టెలిగ్రామ్‌ను తొలగించగా, యాపిల్ కూడా త్వరలోనే ఈ దిశగా చర్యలు తీసుకోనుంది. నీట్ పునఃపరీక్ష నేపథ్యంలో కొందరు కేటుగాళ్లు టెలిగ్రామ్ ఛానెళ్ల వేదికగా నకిలీ ప్రశ్నపత్రాలు విక్రయిస్తామంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారు. పాత మెసేజ్‌లను ఎడిట్ చేస్తూ ప్రశ్నాపత్రాలు లీకైనట్లు నకిలీ ఆధారాలను సృష్టిస్తూ విద్యార్థులను, వారి తల్లిదండ్రులను మానసిక ఆందోళనకు గురిచేస్తున్నారు. ఈ తరహా మోసాలకు అడ్డుకట్ట వేసేందుకే ప్రభుత్వం ఈ యాప్‌పై తాత్కాలిక ఆంక్షలు విధించింది. అంతేకాకుండా, జూన్ 30 వరకు టెలిగ్రామ్‌లో మెసేజ్ ఎడిటింగ్ ఫీచర్‌ను కూడా నిలిపివేశారు.

## పిల్లల గుడ్లు, పప్పుల్లో రూ. 2 వేల కోట్ల స్కామ్..
## రేవంత్ అన్నదమ్ములే కోటీశ్వరులయ్యారంటూ హరీశ్ రావు ఫైర్!

(మొదటి పేజీ తరువాయి)

కాంగ్రెస్ మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ విసిరిన సవాళ్లకు హరీశ్ రావు కౌంటర్ ఇచ్చారు. గురుకులాల్లో యూనిఫాంలు, బైల కోసం రూ. 1,200 కోట్లు.. ఉప్పులు, పప్పులు, చికెన్, గుడ్ల కోసం రూ. 800 కోట్లకు టెండర్లు పిలిచారని, ఈ రెండు కలిపితేనే రూ. 2,000 కోట్లు అవుతుందని లెక్కలు చెప్పారు. తమ శాఖల్లో ఏం జరుగుతుందో కూడా తెలియని స్థితిలో మంత్రులు ఉన్నారని ఎద్దేవా చేశారు. చివరకు గురుకులాల్లో చదువుకునే పేద పిల్లలకు పెట్టే గుడ్లు, పప్పుల్లో కూడా స్కామ్ చేస్తారా? అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీశారు. ఎన్నికల ముందు కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తానని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని హరీశ్ రావు గుర్తుచేశారు. కానీ ఇప్పటివరకు రాష్ట్రంలో ఒక్క మహిళ కూడా కోటీశ్వరురాలు కాలేదని, అయితే రేవంత్ అన్నదమ్ములు మాత్రం కోటీశ్వరులయ్యారని ఆయన ఘాటు వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రే స్వయంగా మొత్తం టెండర్లు పిలుస్తూ, ఆ నిధులన్నీ తన అన్నదమ్ములకే కట్టబెడుతున్నారని.. అందుకే ఈ వ్యవహారాలు రాష్ట్ర మంత్రులకు కూడా తెలియడం లేదని ఆరోపించారు.

# కేంద్ర జలశక్తి మంత్రితో పవన్ భేటీ..



ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఢిల్లీ పర్యటనలో బిజీగా ఉన్నారు. ఈరోజు ఆయన కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. రాష్ట్రంలోని తాగునీటి ఎద్దడి, కలుషితమవుతున్న నదుల పరిరక్షణ, జల్ జీవన్ మిషన్ అమలు వంటి కీలక అంశాలపై ఇరువురు నేతలు సుదీర్ఘంగా చర్చించారు. ఏపీలోని కొన్ని ప్రాంతాల్లో ఇంకా నీటి కొరత తీరలేదని పవన్ కల్యాణ్ కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రజలకు స్థిరమైన తాగునీటి సరఫరా అందించడానికి గుజరాత్‌లోని 'సూరత్ నమూనా'ను అధ్యయనం చేయాలని అధికారులకు పవన్ సూచించారు. సూరత్‌లో పారిశ్రామిక వ్యర్థ జలాలను శుద్ధి చేసి మళ్లీ ఎలా విజయవంతంగా వినియోగిస్తున్నారో, అదే విధానాన్ని ఆంధ్రప్రదేశ్‌లో కూడా అమలు చేసే అవకాశాలను పరిశీలించాలని అన్నారు. గోదావరి పుష్కరాలు సమీపిస్తున్న నేపథ్యంలో నదీ జలాల స్వచ్ఛతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పవన్ స్పష్టం చేశారు. పారిశ్రామిక కాలుష్యం వల్ల ఏపీలోని నదులు, జలవనరులు దారుణంగా దెబ్బతింటున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. పరిశ్రమలు వదిలే వ్యర్థాల వల్ల నదులు కలుషితం కాకుండా 'జీరో లిక్విడ్ డిశ్చార్జ్' విధానాన్ని కఠినంగా అమలు చేయాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు.

# SIRపై సీఎం రేవంత్ సీరియస్..

(మొదటి పేజీ తరువాయి)

అధికారులతో (దీూ) కాంగ్రెస్ ముఖ్య నాయకులు నిరంతరం అనుసంధానమై ఉండాలని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ముఖ్యంగాఉపాధి లేదా ఇతర కారణాల వల్ల వలసలు వెళ్లిన ఓటర్లు, బీఎల్ఓలు క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లినప్పుడు ఇళ్లలో అందుబాటులో ఉండకపోవచ్చని, ఆ కారణంతో వారి ఓట్లను తొలగించకుండా అత్యంత జాగ్రత్త వహించాలని సూచించారు. ఈ ప్రక్రియను ఎవరూ ఆషామాషీగా తీసుకోవద్దని, ప్రతి ఒక్కరూ అత్యంత సీరియస్‌గా రంగంలోకి దిగి అర్హులైన వారి ఓటు హక్కును కాపాడాలని పిలుపునిచ్చారు. ఓట్ల పరిరక్షణ కోసం జిల్లా ఇంచార్జి మంత్రులు ఈ నెల 20వ తేదీ లోపు సంబంధిత పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల ఇంచార్జ్‌లతో ప్రత్యేక సమీక్షా సమావేశాలు నిర్వహించాలని సీఎం ఆదేశించారు. నియోజకవర్గాల వారీగా ప్రత్యేక మానిటరింగ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేసుకుని ఎక్కడికక్కడ సమస్యలను పర్యవేక్షించాలన్నారు. ఎక్కడ తప్పులు జరిగినా అసెంబ్లీ స్థానాల్లో అసెంబ్లీ ఇంచార్జ్‌లు, పార్లమెంట్ పరిధిలో పార్లమెంట్ ఇంచార్జ్‌లే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. దీనితో పాటు, రాష్ట్ర కాంగ్రెస్ ప్రధాన కార్యాలయం గాంధీ భవన్‌లో ప్రత్యేక 'వార్ రూమ్' ఏర్పాటు చేసి, బూత్ స్థాయి సమాచారాన్ని ఏ రోజుకారోజు నివేదికల రూపంలో తెప్పించుకుంటూ నిరంతర పర్యవేక్షణ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు.

# స్వర్ణాంధ్ర 2047 విజన్‌తో ముందుకు ఏపీ..

(మొదటి పేజీ తరువాయి)

మీడియా వంటి థీమ్‌లతో అమరావతిని అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. క్వాంటం కంప్యూటింగ్ హబ్, డిజిటల్ మౌలిక వసతులు దీనికి ప్రత్యేకతను తెస్తాయని పేర్కొన్నారు. 21 కిలోమీటర్ల కృష్ణా నది తీరం వెంబడి వాటర్ ఫ్రంట్ సిటీగా, ఇన్నర్-ఔటర్ రింగ్ రోడ్లు, ఐకానిక్ వంతెనలతో అమరావతి అద్భుతంగా రూపుదిద్దుకోనుందని అన్నారు. సైక్లింగ్, వాకింగ్ ట్రాక్‌లు, గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్, భూగర్భ యుటిలిటీస్, గ్రీన్ ఎనర్జీ, నెట్ జీరో ఉద్గారాల లక్ష్యంగా రాజధాని నిర్మాణం జరుగుతోందని చెప్పారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా, తమ పిలుపు మేరకు రైతులు 35 వేల ఎకరాల భూమిని స్వచ్ఛందంగా రాజధాని కోసం ఇచ్చారని, ఆ భూమిని అభివృద్ధి చేసి రైతులకు ప్లాట్ల రూపంలో తిరిగి ఇచ్చే ల్యాండ్ పూలింగ్ మోడల్‌ను ఆయన సదస్సులో వివరించారు. అభివృద్ధి ద్వారానే సంపద సృష్టి సాధ్యమని చెప్పేందుకు తాను గతంలో నిర్మించిన సైబరాబాద్‌ను చంద్రబాబు ఉదాహరణగా చూపారు. "25 ఏళ్ల క్రితం నేను ఐటీ గురించి మాట్లాడాను. భవిష్యత్తును ముందుగానే ఊహించి 'ఫస్ట్ మూవర్ అడ్వాంటేజ్' తీసుకున్నాం. దాని ఫలితంగానే నేడు తెలుగువారు తలసరి ఆదాయంలో ముందున్నారు. ఇప్పుడు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) గురించి ఆలోచిస్తున్నాం," అని ఆయన అన్నారు. నాడు తాను నిర్మించిన సైబరాబాద్ నేడు తెలంగాణకు ప్రధాన ఆదాయ వనరుగా మారిందని, ఒకప్పుడు ఎకరం రూ.2 లక్షలు ఉన్న భూమి ఇప్పుడు రూ.200 కోట్లకు పెరిగిందని గుర్తు చేశారు. రాష్ట్ర విభజన తర్వాత మరోసారి కొత్త నగరాన్ని నిర్మించే అవకాశం తనకు దక్కిందని పేర్కొన్నారు. ప్రసంగం అనంతరం, సదస్సు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సింగపూర్ ఇన్నోవేషన్, టెక్నాలజీ ప్రదర్శన స్టాళ్లను ముఖ్యమంత్రి సందర్శించారు. సింగపూర్ పెవిలియన్‌లోని అత్యాధునిక పట్టణాభివృద్ధి నమూనాలను, 'ఇన్నోవేటర్స్ అలే'లో స్టార్టప్‌ల ఆవిష్కరణలను, గూగుల్ స్టాల్‌ను ఆసక్తిగా పరిశీలించారు. టెక్నాలజీ ఆధారిత పాలనలో సింగపూర్ అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌ను, ముఖ్యంగా రాజధాని అమరావతిని తమ రెండో నివాసంగా ఎంచుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సింగపూర్ పారిశ్రామికవేత్తలకు సాదరంగా పిలుపునిచ్చారు. పెట్టుబడులకు ఏపీ అత్యంత అనుకూలమైన, సురక్షితమైన గమ్యస్థానమని, 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'కు తమ ప్రభుత్వమే పేటెంట్ అని ఆయన స్పష్టం చేశారు. ఈ ఏడాది విశాఖపట్నంలో జరగనున్న సీఐఐ భాగస్వామ్య సదస్సుకు సన్నాహకంగా సింగపూర్‌లో నిర్వహించిన బిజినెస్ రోడ్ షోలో పాల్గొన్న చంద్రబాబు, రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అపార అవకాశాలను వివరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. "సింగపూర్‌తో భారత్‌కు, ప్రత్యేకించి ఆంధ్రప్రదేశ్‌కు మూడు దశాబ్దాలుగా బలమైన అనుబంధం ఉంది. సింగపూర్ నిర్మాత లీ క్వాన్ యూ నాకు స్ఫూర్తి. రాష్ట్ర విభజన తర్వాత రాజధాని అమరావతి నిర్మాణానికి సింగపూర్ అద్భుతమైన మాస్టర్ ప్లాన్ ఇచ్చింది. ఇప్పుడు అమరావతితో పాటు రాష్ట్రంలోని ఇతర పట్టణాల అభివృద్ధిలోనూ సింగపూర్‌తో కలిసి పనిచేస్తున్నాం. భూమి, నీరు, మౌలిక వసతులు, అత్యుత్తమ పాలసీలతో పెట్టుబడులకు ఏపీ స్వర్గధామం" అని అన్నారు. రాష్ట్రంలో పరిశ్రమలకు భూకేటాయింపులు, అనుమతులు అత్యంత వేగంగా ఇస్తున్నామని చంద్రబాబు తెలిపారు. "ప్రపంచ దిగ్గజ స్టీల్ కంపెనీ ఆర్సెలార్ మిట్టల్‌కు అతి తక్కువ సమయంలోనే అన్ని అనుమతులు ఇచ్చాం. 2028 నాటికి ఆ సంస్థ ఉత్పత్తి ప్రారంభించి ఏపీ నుంచి ఎగుమతులు చేస్తుంది. అలాగే గూగుల్ క్లౌడ్ ఏఐ డేటా హబ్ ఏర్పాటు కాబోతోంది. దానికి గ్రీన్ ఎనర్జీ సరఫరా చేస్తాం. గూగుల్‌తో పాటు మరో 10 గిగావాట్ల సామర్థ్యంతో వివిధ కంపెనీలు డేటా సెంటర్లు ఏర్పాటు చేస్తున్నాయి. ఎల్జీ ఎలక్ట్రానిక్స్ రూ.7 వేల కోట్లతో శ్రీసిటీలో గృహోపకరణాల యూనిట్ ప్రారంభిస్తోంది" అని వివరించారు. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యం కలిగిన మానవ వనరుల కోసం ఆపరేషనల్ స్కిల్ యూనివర్సిటీని కూడా ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. 'వికసిత్ భారత్ 2047' స్ఫూర్తితో 'స్వర్ణాంధ్ర 2047' విజన్‌కు రూపకల్పన చేశామని, త్వరలోనే ఆంధ్రప్రదేశ్.. భారత ఆర్థిక వ్యవస్థకు పవర్ హౌస్‌గా మారుతుందని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. "సుదీర్ఘ తీరప్రాంతం, అపార ఖనిజ సంపద, అద్భుతమైన పర్యాటక ప్రాంతాలు ఏపీ సొంతం. ఆక్వా, హార్టికల్చర్, వ్యవసాయ రంగాల్లో రాష్ట్రం దేశంలోనే కీలకంగా ఉంది. రాష్ట్రంలో, కేంద్రంలో సుస్థిర ప్రభుత్వాలు ఉండటం మనకు కలిసొచ్చే అంశం. ఏపీ నుంచి ఎగుమతులు పెంచేందుకు పోర్టులు, ఎయిర్‌పోర్టులను సిద్ధం చేస్తున్నాం" అని అన్నారు. "అమరావతిలో ఐబీఎం, టీసీఎస్, ఎల్ అండ్ టీ సంస్థలు కలిసి 133 క్యూబిట్ క్వాంటం కంప్యూటర్‌ను ఏర్పాటు చేస్తున్నాయి. ఈ ఏడాది డిసెంబరు నాటికి ఇది పనిచేయడం ప్రారంభిస్తుంది. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై నగరాలను కలిపేలా హైస్పీడ్ రైల్ నెట్వర్క్‌ను అమరావతికి అనుసంధానిస్తాం.

# ఐఆర్ఎఫ్‌సీ రుణాలకు సాంకేతిక ఇబ్బందులున్నాయి

హైదరాబాద్ మెట్రో విస్తరణను కేంద్రం అడ్డుకుంటోందంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన ఆరోపణలను కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి ఖండించారు. తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే సీఎం తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. మెట్రో రైలు ప్రాజెక్టు విషయంలో రేవంత్ తనపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని కిషన్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ మెట్రో ఫేజ్-1 అమలుకు కేంద్రం రూ.1,200 కోట్లు అందించిందని వెల్లడించారు. మెట్రో విస్తరణ కోసం మరింత చురుగ్గా పనిచేయాలని తానే రేవంత్‌రెడ్డికి లేఖ రాశానన్నారు. ఐఆర్ఎఫ్‌సీ ద్వారా రుణం పొందేందుకు కూడా కేంద్రం సహకరిస్తోందని చెప్పారు. ఐఆర్ఎఫ్‌సీ రూ.13 వేల కోట్ల రుణ ప్రతిపాదన విషయంలో కొన్ని సాంకేతిక కారణాలు ఉన్నాయని తెలిపారు. వాటిని కేంద్రంతో చర్చించి పరిష్కరించుకోవాల్సింది పోయి రాజకీయ విమర్శలకు దిగడం సరికాదన్నారు. ఆ సమస్యను తనపై నెట్టేందుకు ప్రయత్నించడం బాధాకరమన్నారు. తెలంగాణ, హైదరాబాద్ అభివృద్ధిపై తమకు ఎవరూ పాఠాలు చెప్పాల్సిన అవసరం లేదని కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. జహీరాబాద్‌లో ఇండస్ట్రియల్ ప్రాజెక్టు, ఎన్‌టీపీసీ విద్యుత్ ప్రాజెక్టు, ధాన్యం కొనుగోలు వంటి అంశాల్లో కేంద్రం సహకరిస్తోందన్నారు. మూసీ పునరుజ్జీవన కార్యక్రమానికి అవసరమైన రుణాల మంజూరుకు కూడా కేంద్రం ఎన్ఓసీ ఇచ్చిందని తెలిపారు. రాష్ట్రాల్లో ఏ పార్టీ అధికారంలో ఉన్నా కేంద్రం ఎలాంటి వివక్ష చూపదని స్పష్టం చేశారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందన్నారు. దిగజారుడు రాజకీయాలకు పాల్పడకుండా అభివృద్ధి అంశాలపై కేంద్రంతో సమన్వయం చేసుకుని ముందుకెళ్లాలని సూచించారు. కిషన్‌రెడ్డి చెప్పినంత మాత్రాన ప్రాజెక్టులు ఆగిపోవని, ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు మానుకోవాలని రేవంత్‌రెడ్డికి హితవు పలికారు.

# అమెరికా-ఇరాన్ ఒప్పందంలో తెరవెనుక చక్రం తిప్పిన ఖతార్!

అమెరికా, ఇరాన్ దేశాల మధ్య గత వంద రోజులకు పైగా కొనసాగుతున్న తీవ్ర ఉద్రిక్తతలకు తెరపడే సూచనలు కనిపిస్తున్నాయి. ఇరు దేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం వెనుక ఖతార్ జరిపిన నిరంతర, రహస్య దౌత్యం కీలక పాత్ర పోషించినట్లు అంతర్జాతీయ కథనాలు వెల్లడిస్తున్నాయి. ఈ ఒప్పందంతో కీలకమైన హర్మూజ్ జలసంధిని తిరిగి తెరవడంతో పాటు, అణు చర్చల పునరుద్ధరణకు మార్గం సుగమం కానుంది. ఈ ఒప్పందంపై త్వరలోనే తటస్థ వేదికైన జెనీవాలో అధికారికంగా సంతకాలు జరగనున్నాయి. ఒప్పందం నిబంధనల ప్రకారం, ఇరు పక్షాలు తక్షణమే కాల్పుల విరమణను పాటించాల్సి ఉంటుంది. దీనితో పాటు, ప్రపంచ ఇంధన సరఫరాకు అంతరాయం కలిగించిన హర్మూజ్ జలసంధిలో నౌకల రాకపోకలను పునరుద్ధరించనున్నారు. కొన్ని ధ్రువీకరించదగిన చర్యలకు ప్రతిఫలంగా ఇరాన్‌పై ఉన్న ఆంక్షలను దశలవారీగా సడలించేందుకు కూడా అంగీకారం కుదిరింది. 2026 ప్రారంభం నుంచి అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య చోటుచేసుకున్న సైనిక చర్యలతో ఈ ప్రాంతంలో ఉద్రిక్తతలు పరాకాష్ఠకు చేరాయి. చర్చల ప్రారంభ దశలో పాకిస్థాన్ చొరవ తీసుకుని ఇరు దేశాల మధ్య సంప్రదింపులకు వేదిక కల్పించింది. అయితే, అణు పరిమితులు, యురేనియం నిల్వలు వంటి క్లిష్టమైన సాంకేతిక అంశాలపై ఏకాభిప్రాయం సాధించడంలో ఆ ప్రయత్నాలు పూర్తిస్థాయిలో ఫలించలేదు. ఈ క్లిష్ట పరిస్థితుల్లో ఖతార్ రంగంలోకి దిగింది. అమెరికా, ఇరాన్ దేశాలతో సత్సంబంధాలు కలిగిన ఖతార్ రాయబారులు, ఇరు దేశాల మధ్య రహస్య మంతనాలు జరిపి, ఒప్పందంలోని సంక్లిష్టాంశాలపై ఏకాభిప్రాయం సాధించడంలో సఫలమయ్యారు. హర్మూజ్ జలసంధిని తిరిగి తెరిచేందుకు, నావికాదళ దిగ్బంధనాన్ని సడలించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ధ్రువీకరించారు. నెలల తరబడి కొనసాగిన అనిశ్చితి తర్వాత ఈ ఒప్పందం ఒక చారిత్రాత్మక ముందడుగుగా దౌత్యవేత్తలు భావిస్తున్నారు.

# జూలై మూడో వారంలో 'తల్లికి వందనం'..

రాష్ట్ర విద్యావ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేసి, విద్యార్థులకు నాణ్యమైన భవిష్యత్తును అందించే దిశగా ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా, విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ విద్యాశాఖ అధికారులతో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల తల్లులకు ఆర్థిక సాయం అందించే 'తల్లికి వందనం' పథకాన్ని జులై మూడో వారంలో అమలు చేసేందుకు సిద్ధం కావాలని అధికారులను ఆదేశించారు. దీంతో పాటు, పాఠశాల విద్య నుంచి ఉన్నత విద్య వరకు పలు కీలక అంశాలపై మంత్రి దిశానిర్దేశం చేశారు. ఉండవల్లిలోని తన నివాసంలో పాఠశాల, ఉన్నత విద్యాశాఖల అధికారులతో మంత్రి సుదీర్ఘంగా సమీక్షించారు. 'తల్లికి వందనం' పథకం అమలుపై ప్రధానంగా చర్చించారు. తల్లుల ఆధార్ వెరిఫికేషన్ ప్రక్రియ దాదాపుగా పూర్తయిందని, జులై మూడో వారంలో పథకాన్ని అమలు చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని అధికారులు మంత్రికి వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలను పెంచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని లోకేశ్ స్పష్టం చేశారు. విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసేందుకు జూన్ 29న 'షైనింగ్ స్టార్స్' కార్యక్రమం, తల్లిదండ్రులను భాగస్వాములను చేసేందుకు జులై మూడో వారంలో 'మెగా పీటీఎం' నిర్వహించాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. మిగులు ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియపైనా చర్చించారు. పాఠశాల విద్యపై సమీక్ష అనంతరం,



ఉన్నత విద్యారంగంపై మంత్రి లోకేశ్ దృష్టి సారించారు. రాష్ట్రంలో నిర్వహించే ఎప్‌సెట్, పాలిసెట్, ఆర్‌సెట్ వంటి 12 రకాల ఉమ్మడి ప్రవేశ పరీక్ష (సెట్)ల నిర్వహణలో ఎలాంటి జాప్యం జరగకూడదని గట్టిగా ఆదేశించారు. సాధ్యమైనంత త్వరగా నోటిఫికేషన్లు విడుదల చేసి, నిర్ణీత గడువులోగా అడ్మిషన్ల ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. జాతీయ స్థాయి పరీక్షలు, పొరుగు రాష్ట్రాల సెట్ల తేదీలను దృష్టిలో ఉంచుకుని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా షెడ్యూల్ ఖరారు చేయాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని 254 ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో 1.88 లక్షల ఇంజనీరింగ్ సీట్ల భర్తీకి ఎప్‌సెట్ నోటిఫికేషన్ సిద్ధంగా ఉందని అధికారులు తెలిపారు. ప్రభుత్వ ఇంజనీరింగ్, పాలిటెక్నిక్ కళాశాలల్లో సీట్ల పెంపును పరిశీలించాలని, ముఖ్యంగా డిమాండ్ ఉన్న మెకానికల్, సివిల్ బ్రాంచ్‌లపై దృష్టి పెట్టాలని సూచించారు. ాాష్ట్రానికి ప్రపంచస్థాయి విద్యాసంస్థలను తీసుకురావడం ద్వారా ఉన్నత విద్యా ప్రమాణాలను పెంచాలని మంత్రి ఆకాంక్షించారు. థాపర్ ఇనిస్టిట్యూట్, జేమ్స్ కుక్ యూనివర్సిటీ, మెల్ బోర్న్ యూనివర్సిటీ వంటి ప్రతిష్ఠాత్మక జాతీయ, అంతర్జాతీయ సంస్థలు రాష్ట్రంలో తమ క్యాంపస్‌లను ఏర్పాటు చేసేందుకు చూపుతున్న ఆసక్తిపై చర్చించారు. ముఖ్యంగా, జీఎంఆర్ మాన్సాస్ ఏవియేషన్ యూనివర్సిటీ ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేయాలని లోకేష్ ఆదేశించారు. ఇదే సమయంలో, రాష్ట్రంలో ఎన్‌సీసీ కార్యకలాపాలను సమన్వయం చేసేందుకు ప్రత్యేక 'ఎన్‌సీసీ స్టేట్ డైరెక్టరేట్'ను మంజూరు చేసిన కేంద్ర ప్రభుత్వానికి మంత్రి ధన్యవాదాలు తెలిపారు. ఈ నిర్ణయంతో ఏపీ యువతకు సైనిక శిక్షణలో మరిన్ని అవకాశాలు లభిస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి జె. శ్యామలరావు, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ తమీమ్ అన్సారియా, ఉన్నతవిద్యా కమిషనర్ నారాయణ్ భరత్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.



## దిల్‌సుఖ్‌నగర్‌లో నిరుద్యోగుల ఆందోళన.. లాఠీచార్జ్‌తో ఉద్రిక్తత

హైదరాబాద్, జూన్ 16:లి కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన 2 లక్షల ఉద్యోగాల భర్తీ హామీని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ దిల్‌సుఖ్‌నగర్‌లో నిరుద్యోగులు మరోసారి భారీ నిరసన చేపట్టారు. పెద్ద సంఖ్యలో రోడ్డుపైకి వచ్చిన యువత ప్రభుత్వం వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఆందోళన నిర్వహించారు.పోలీస్ ఉద్యోగాల భర్తీ ప్రక్రియను వేగవంతం చేయాలని, కేవలం 5 వేల పోస్టులు కాకుండా 20 వేల కానిస్టేబుల్ పోస్టులను భర్తీ చేయాలని నిరుద్యోగులు డిమాండ్ చేశారు. డప్పు చప్పుళ్లతో తమ నిరసనను వ్యక్తం చేసిన ఆందోళనకారులు ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా విమర్శించారు.పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు రంగంలోకి దిగి నిరసనకారులను చెదరగొట్టే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా నిరుద్యోగులపై లాఠీచార్జ్ చేసినట్లు సమాచారం. దీంతో కొంతసేపు దిల్‌సుఖ్‌నగర్ పరిసరాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పలువురు నిరసనకారులను అదుపులోకి తీసుకుని సమీప పోలీస్ స్టేషన్లకు తరలించినట్లు తెలిసింది.ఇప్పటికే ఉస్మానియా విశ్వవిద్యాలయంలో విద్యార్థులు ఉద్యోగాల భర్తీపై ర్యాలీలు, ధర్నాలు నిర్వహించగా, తాజాగా దిల్‌సుఖ్‌నగర్‌లో జరిగిన నిరసనతో నిరుద్యోగుల ఆందోళనలు మరింత ఉధృతమయ్యాయి. తమ డిమాండ్లు నెరవేర్చకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని విస్తరిస్తామని నిరుద్యోగ సంఘాల నాయకులు హెచ్చరించారు. ఉద్యోగాల భర్తీ అంశంపై ప్రభుత్వం నుంచి స్పష్టమైన ప్రకటన రావాలని నిరుద్యోగులు కోరుతున్నారు. ప్రస్తుతం ఈ ఘటన రాజకీయ, సామాజిక వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

## కాంగ్రెస్ లో పదవుల పంచాయితీ

హైదరాబాద్, జూన్ : కాంగ్రెస్ పార్టీలో సీనియర్లలో అసంతృప్తి పెరుగుతుంది. ఇందుకు సీనియర్ నేత షబ్బీర్ ఆలి ఉదాహరణ. ఆయన చేసిన వ్యాఖ్యలు పార్టీని ఇబ్బందులకు గురి చేశాయి. కాంగ్రెస్ పార్టీలో పదవులను డబ్బులు ఇచ్చిన వారికే ఇస్తున్నారని షబ్బీర్ ఆలి తీవ్ర స్థాయిలో విమర్శించారు. కష్టించి పనిచేసిన నేతలకు కాకుండా అప్పటికప్పుడు పార్టీలోకి వచ్చి డబ్బులు ఇచ్చిన వారికి పదవులు కట్టబెడుతున్నారని షబ్బీర్ ఆలి చేసిన ఆరోపణలు కాంగ్రెస్ పార్టీలో కాక రేపాయి. గత కొంత కాలంగా షబ్బీర్ ఆలి అసంతృప్తితో ఉన్నారు.తనను పార్టీ నాయకత్వం పట్టించుకోవడం లేదని ఆయన భావిస్తున్నారు. పైగా కామారెడ్డి నియోజకవర్గంలో తనకు వ్యతిరేకంగా మరొక నేతను ప్రోత్సహించేందుకు సిద్ధమయ్యారని ఆయన భావిస్తున్నారు. గత కొంత కాలం నుంచి షబ్బీర్ ఆలి కి, చంద్రశేఖర్ రెడ్డి మధ్య విభేదాలు తీవ్రస్థాయికి చేరుకున్నాయి. ఒకరిపై ఒకరు తీవ్ర స్థాయిలో విమర్శలు చేసుకంటున్నారు. ఈ ఇద్దరి మధ్య వివాదం నేపథ్యంలోనే షబ్బీర్ ఆలీ ఈ వ్యాఖ్యలు చేశారని ప్రత్యర్థి వర్గం ఆరోపిస్తుంది. పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ పై ఆయన చేసిన తీవ్ర వ్యాఖ్యలపై ఏఐసీసీ కూడా అంతే స్థాయిలో స్పందించింది. షబ్బీర్ ఆలీకి షోకాజ్ నోటీసులు జారీ చేసింది.అయితే షబ్బీర్ ఆలీ మాత్రం ఆ వ్యాఖ్యలకు, తనకు ఏ మాత్రం సంబంధం లేదని చెప్పారు. ఆ ఆడియోలో వినిపిస్తున్న వాయిస్ తనది కాదని అన్నారు. తన ప్రతిష్టను దెబ్బతీసేందుకు కొందరు కుట్ర పన్నారంటూ షబ్బీర్ ఆలీ వివరణ ఇచ్చారు. మహేష్ కుమార్ గౌడ్ తో తనకు సుదీర్ఘ కాలం నుంచి తెలుసునని, మంచి మిత్రుడని చెప్పారు. ఆయనపై తాను వ్యతిరేక వ్యాఖ్యలు ఎందుకు చేస్తానని షబ్బీర్ ఆలీ అన్నారు. షోకాజ్ నోటీసులకు అవసరమైన సమాధానాన్ని తాను ఇస్తానని కూడా షబ్బీర్ ఆలీ చెప్పారు. మొత్తం మీద కాంగ్రెస్ లో సీనియర్ నేతలు ఒకింత అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పార్టీ నాయకత్వం కూడా పార్టీ కోసం సుదీర్ఘకాలం పనిచేసిన వారిని పట్టించుకోవాలని పలువురు కోరుతున్నారు.

## బీఆర్‌ఎస్‌ను ట్రాక్‌లోకి తెచ్చేందుకు బస్సు యాత్ర

తెలంగాణ రాజకీయాల్లో భారత్ రాష్ట్ర సమితి అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు మళ్లీ యాక్టివ్ కాబోతున్నారనే వార్తలు గులాబీ శ్రేణుల్లో కొత్త జోష్ నింపుతున్నాయి. కేసీఆర్ త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా బస్సు యాత్ర చేపట్టబోతున్నారని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రకటించడంతో పొలిటికల్ సర్కిల్స్‌లో సరికొత్త చర్చ మొదలైంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి, ఆ వెంటనే జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో బస్సు యాత్ర చేసినప్పటికీ పార్టీ ఖాతాలో ఒక్క సీటు కూడా పడకుండా జీరో ఫలితం రావడం కేసీఆర్‌ను తీవ్ర నిరాశకు గురిచేసింది. ఆ దెబ్బతో దాదాపు రెండేళ్లకు పైగా ఆయన ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యారు. కేవలం ఇటీవల జరిగిన పార్టీ ప్లీనరీ, అలాగే జగిత్యాల లాంటి రెండు బహిరంగ సభల్లో మాత్రమే ఆయన ప్రసంగించి వెళ్లారు తప్ప క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి రాలేదు.ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు దాటిపోతున్న తరుణంలో.. కేసీఆర్ ఇప్పుడు బస్సు యాత్ర అస్త్రం చేతబట్టడం వెనుక కేవలం పార్టీ ఉనికిని చాటుకోవడమే కాకుండా, రాబోయే స్థానిక సంస్థలు లేదా సార్వత్రిక ఎన్నికల కోసం క్యాడర్‌ను సమాయత్తం చేయడమే ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది. అయితే, రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం.. కేసీఆర్ ఈ యాత్ర పూర్తి చేసిన తర్వాత మళ్లీ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేంతవరకు ప్రజల్లోకి వచ్చే అవకాశాలు తక్కువే. అంతేకాదు, ఆయన ఇకపై అసెంబ్లీ సమావేశాలకు కూడా వచ్చే మూడ్‌లో లేరని స్పష్టమవుతోంది. సభలో కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టే పూర్తి భారాన్ని ఆయన కేటీఆర్, తన్నీరు హరీష్ రావుల భుజాలపైనే పెట్టేశారు.

అసెంబ్లీ వేదికగా గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనపై, అలాగే ప్రస్తుత రెండున్నరేళ్ల కాంగ్రెస్ పాలనపై బహిరంగ చర్చకు రావాలని సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా సవాల్ విసిరినా కేసీఆర్ సైలెంట్‌గా ఉండటం వెనుక పెద్ద వ్యూహమే ఉంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిత్యం వేస్తున్న పొలిటికల్ సవాళ్లకు సమాధానం ఇచ్చేందుకు కేసీఆర్ ఏమాత్రం ఆసక్తి చూపించడం లేదు. తన స్థాయికి రేవంత్ రెడ్డి సరిపోరు, జూనియర్ నేతతో తాను నేరుగా తలపడటం వల్ల ఆయనకే ఎక్కువ పొలిటికల్ మైలేజ్ లభిస్తుంది .

# బొంతపల్లి వీరభద్ర స్వామి దేవస్థానానికి నూతన ఈవోగా రామ బ్రహ్మచారి

### చిక్కడపల్లి దేవస్థానం నుంచి పదోన్నతిపై బాధ్యతల స్వీకరణ

### ఏడేళ్ల సేవల అనంతరం చంపాపేట్‌కు బదిలీ అయిన ఈవో శశిధర్

**గుమ్మడిదల, జూన్ 16 (నేటి ప్రస్థానం):** గుమ్మడిదల మండలంలోని బొంతపల్లి వీరన్నగూడెంలో వెలసిన ప్రసిద్ధ శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి దేవస్థానానికి నూతన గ్రేడ్-1 కార్యనిర్వహణ అధికారిగా (ఈవో) రామ బ్రహ్మచారి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో హైదరాబాద్‌లోని చిక్కడపల్లి దేవస్థానంలో విధులు నిర్వహించిన ఆయన పదోన్నతి పొంది బొంతపల్లి దేవస్థానానికి బదిలీపై నియమితులయ్యారు.ఈ సందర్భంగా దేవస్థాన అధికారులు, అర్చకులు, సిబ్బంది నూతన ఈవోకు ఘన స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. భక్తులకు మరింత మెరుగైన సేవలు అందించడంతో పాటు దేవస్థాన అభివృద్ధి, పారదర్శక పరిపాలన, సౌకర్యాల విస్తరణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తానని రామ బ్రహ్మచారి పేర్కొన్నట్లు దేవస్థాన పర్యవేక్షకులు సోమయ్య తెలిపారు.కాగా, గత ఏడు సంవత్సరాలుగా బొంతపల్లి దేవస్థానంలో కార్యనిర్వహణ అధికారిగా సేవలందించిన శశిధర్ బదిలీపై హైదరాబాద్‌లోని వందన ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానం, చంపాపేట్‌కు వెళ్లారు. ఆయన హయాంలో దేవస్థాన అభివృద్ధి, భక్తులకు సౌకర్యాల కల్పనలో విశేష కృషి చేసినట్లు పలువురు భక్తులు, సిబ్బంది అభిప్రాయపడ్డారు.నూతన ఈవో రామ బ్రహ్మచారి నాయకత్వంలో దేవస్థానం మరింత అభివృద్ధి సాధించి భక్తులకు ఉత్తమ సేవలు అందిస్తుందనే ఆశాభావాన్ని స్థానికులు వ్యక్తం చేశారు.



### దక్షిణాఫ్రికాలో తెలంగాణ బిడ్డకు

# అరుదైన గౌరవం

### 'శీతాకాల సేవా వీరుడు'గా గుర్రాల నాగరాజు ఎంపిక

జగిత్యాల, జూన్ 16:లి దక్షిణాఫ్రికాలో సామాజిక సేవలో విశేష కృషి చేస్తున్న తెలంగాణకు చెందిన గుర్రాల నాగరాజుకు అరుదైన గౌరవం దక్కింది. సామాజిక సేవా కార్యక్రమాల్లో విశేష సేవలందిస్తున్న వ్యక్తులను గుర్తిస్తూ ఓ ప్రముఖ సంస్థ ప్రకటించిన 'శీతాకాల సేవా వీరుల' జాబితాలో భారతదేశం నుంచి ఎంపికైన ఏకైక వ్యక్తిగా ఆయన నిలిచారు.జగిత్యాల జిల్లాకు చెందిన నాగరాజు గత 18 ఏళ్లుగా దక్షిణాఫ్రికాలో నివసిస్తూ సామాజిక సేవలో చురుకుగా పాల్గొంటున్నారు. ముఖ్యంగా కరోనా మహమ్మారి సమయంలో వేలాది మందికి ఆహార సహాయం అందించడంతో పాటు అత్యవసర పరిస్థితుల్లో తెలుగు ప్రజలకు అండగా నిలిచారు. పేదలు, అనాథలు, మానసిక వికలాంగులకు సహాయం చేస్తూ సేవా కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించారు. భారతీయ, తెలుగు సమాజ అభివృద్ధి కోసం పలు సామాజిక కార్యక్రమాల్లో పాల్గొంటున్న నాగరాజు మహిళల సాధికారత కోసం ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. మహిళలకు అవసరమైన సామగ్రి పంపిణీ, పోలీసు స్టేషన్లలో దుప్పట్ల పంపిణీ, ముఖ్యమంత్రి సహాయ నిధికి విరాళాల సేకరణ, అవయవదానంపై అవగాహన కార్యక్రమా లు నిర్వహిస్తూ సమాజానికి సేవలందిస్తు న్నారు.ప్రస్తుతం ఒక సాంకేతిక సంస్థ



వ్యవస్థాపకుడిగా, అలాగే బాలల సంక్షేమ సంస్థలో బాధ్యతలు నిర్వర్తిస్తున్న నాగరాజు సాంకేతిక రంగంతో పాటు సామాజిక సేవలోనూ తనదైన ముద్ర వేస్తున్నారు. ఆయనకు లభించిన ఈ గుర్తింపు వ్యక్తిగత గౌరవమే కాకుండా విదేశాల్లో తెలంగాణ ఖ్యాతిని చాటుతున్న ప్రతి తెలుగు వ్యక్తికి దక్కిన గౌరవంగా భావిస్తున్నారు.జగిత్యాల నేల నుంచి ప్రారంభమైన ఆయన ప్రయాణం నేడు అంతర్జాతీయ స్థాయిలో సేవా స్ఫూర్తికి ప్రతీకగా నిలవడం విశేషం. విద్య, కృషి, సేవాభావం ఉంటే ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు సాధించవచ్చని గుర్రాల నాగరాజు మరోసారి నిరూపించారని పలువురు అభినందిస్తున్నారు.

## బ్యాంకు రుణాలు కావాలంటే లంచం



రాజేంద్రనగర్ సర్కిల్‌లో పొదుపు సంఘాల మహిళలకు బ్యాంక్ రుణాలు మంజూరు చేయడంలో భారీ అవినీతి జరుగుతోందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కుటుంబ అవసరాలు లేదా స్వయం ఉపాధి కోసం రుణాలు కోరిన మహిళలను అధికారులు నెలల తరబడి కార్యాలయాల చుట్టూ తిప్పుతూ, లంచాలు అడుగుతున్నారని సమాచారం.దీనిపై సర్కిల్‌లోని పలు సంఘాల మహిళలు తిరుగుబాటు చేసి, అధికారుల ప్రమేయం లేకుండా నేరుగా బ్యాంకులకు లేఖలు రాశారు. విషయం విజిలెన్స్ అధికారుల దృష్టికి వెళ్లడంతో జరిగిన విచారణలో దిగ్భ్రాంతికరమైన నిజాలు బయటపడ్డాయి. రాజేంద్రనగర్ సర్కిల్‌లో 1,400 మంది మహిళలకు మంజూరైన రూ. 4.5 కోట్ల రుణం నుంచి రూ. 4.5 లక్షలు లంచాలకే ఖర్చయ్యాయని ఆధారాలు సేకరించారు.ప్రతి రూ. లక్ష రుణానికి రూ. 1,000 కమీషన్ వసూలు చేస్తున్నట్లు విజయేందర్, లక్ష్మణ్, జె. ఉపేందర్, పి. విజయ్‌కుమార్ వంటి కమ్యూనిటీ ఆర్గనైజర్లు (సీవోలు) విచారణలో ఒప్పుకున్నట్లు తెలుస్తోంది. వీరు ఫోన్ పే, గూగుల్ పే ద్వారా కూడా డబ్బులు వసూలు చేసినట్లు ఆధారాలు సేకరించారు. లంచం అడిగినప్పుడు ప్రశ్నించిన వారిని విధుల నుంచి తొలగించడం, వారి స్థానంలో తమకు అనుకూలమైన వారిని నియమించుకోవడం ఈ సీవోలకు అలవాటుగా మారిందని విజిలెన్స్ అధికారులు గుర్తించారు. నివేదిక ఆధారంగా, అవినీతికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, మహిళల వేధింపులను అరికట్టాలని అధికారులు కమిషనర్‌కు సిఫార్సు చేశారు.

# అక్షరాభ్యాసంతో విద్యా ప్రయాణానికి శ్రీకారం

### మంబాపూర్ ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం





**గుమ్మడిదల, జూన్ 16 ( నేటి ప్రస్థానం ):** సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలంలోని మంబాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఫ్రీ ప్రైమరీ విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు విజయ్ కుమార్ ఆధ్వర్యంలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. చిన్నారుల విద్యాభ్యాసానికి శుభారంభంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు అక్షరాల ప్రాముఖ్యతను వివరించి, వారి చేత తొలి అక్షరాలను దిద్దించారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు విజయ్ కుమార్ మాట్లాడుతూ, ప్రతి చిన్నారి జీవితంలో అక్షరాభ్యాసం ఒక కీలక మైలురాయి అని, విద్య ద్వారానే ఉజ్వల భవిష్యత్తు నిర్మాణం సాధ్యమవుతుందని అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను క్రమం తప్పకుండా పాఠశాలకు పంపించి వారి విద్యాభివృద్ధికి సహకరించాలని సూచించారు.కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు చిన్నారులకు ఆశీస్సులు అందించి వారి విద్యా ప్రయాణానికి శుభాకాంక్షలు తెలిపారు. పాఠశాల ప్రాంగణం ఆనందోత్సాహాలతో కళకళలాడగా, విద్యార్థులు ఉత్సాహంగా అక్షరాభ్యాసంలో పాల్గొని తమ విద్యా జీవితానికి శ్రీకారం చుట్టారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుజాత, ఫ్రీ ప్రైమరీ పాఠశాల ఉపాధ్యాయిని గంగోజిపేట రూప, శ్రీనివాస్ శర్మ, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ ఇస్తారి గంగ, వార్డు సభ్యులు ఇస్తారి బాస్కర్, కొండని నీలవతి, సంపంగి మౌనిక, అశోక్ చారి, కంజర్ల వెంకటస్వామి, మీసాల బాబు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ పేరును గుర్తు చేస్తున్న బస్సులు

హైదరాబాద్‌లోని ప్రధాన మార్గాల్లో బస్సులు తరచూ బ్రేక్‌డౌన్ అవుతుండటంతో ట్రాఫిక్ స్తంభించిపోయి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా నానల్‌నగర్, ఖైరతాబాద్ జంక్షన్, మాసబ్‌ట్యాంక్ కట్టమైసమ్మ దేవాలయం వంటి ప్రాంతాల్లో బస్సులు మధ్యలోనే ఆగిపోవడంతో కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.'మహాలక్ష్మి' ఉచిత ప్రయాణ పథకం ప్రారంభమైన తర్వాత ప్రయాణికుల సంఖ్య పెరగడంతో బస్సులపై అదనపు ఒత్తిడి పడుతోంది. కొత్త బస్సులు రాకపోవడం, నిర్వహణ లోపించడం వల్ల ప్రయాణం నరకప్రాయంగా మారుతోంది.విడిభాగాల కొరత, ఆయిల్ సకాలంలో మార్చకపోవడం వంటి కారణాల వల్ల బస్సులు మధ్యలోనే ఆగిపోతున్నాయి. వైరింగ్, పార్ట్స్ సమస్యల వల్ల కొన్ని బస్సుల నుంచి పొగలు వస్తున్నాయి. డిపోలలో ఫిట్‌నెస్ పరీక్షలు నామమాత్రంగానే జరుగుతున్నాయనే విమర్శలు ఉన్నాయి.మహానగరానికి 7 వేల బస్సులు అవసరం ఉండగా, ఆర్టీసీ ప్రస్తుతం 3200 బస్సులతోనే నెట్టుకొస్తోంది. వీటిలో 500 ఎలక్ట్రిక్ బస్సులు కాగా, మిగిలినవి డీజిల్ బస్సులు.



## ఓటర్ల జాబితా సవరణపై కాంగ్రెస్ బి.ఎల్. ఏ లకు ప్రత్యేక శిక్షణ

**ప్రతి అర్హత కలిగిన ఓటు పరిరక్షణ లక్ష్యం: కాటా శ్రీనివాస్ గౌడ్**



**పటాన్చెరు నియోజకవర్గం:** సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో పటాన్‌చెరులోని ఎస్‌వీఆర్ గార్డెన్స్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ఎస్ .ఐ. ఆర్ కార్యక్రమంపై అవగాహన, శిక్షణ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పార్లమెంట్ కోఆర్డినేటర్ ప్రీతమ్, అసెంబ్లీ కోఆర్డినేటర్ దయాకర్, డీసీసీ అధ్యక్షురాలు టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి, మెదక్ పార్లమెంట్ ఇంచార్జ్ నీలం మధు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పటాన్‌చెరు నియోజకవర్గంలోని బూత్ లెవల్ ఏజెంట్లకు బి. ఎల్ .ఎ ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ, నియమ నిబంధనలు, బి. ఎల్ .ఏ బాధ్యతలపై ప్రత్యేక శిక్షణ అందించారు. ఓటరు జాబితా ప్రజాస్వామ్య వ్యవస్థకు కీలకమని నాయకులు పేర్కొన్నారు. ప్రతి అర్హత కలిగిన పౌరుడు ఓటరుగా నమోదు కావడానికి కృషి చేయాలని సూచించారు. అర్హులైన ఓటర్ల పేర్లు జాబితాలో సక్రమంగా ఉన్నాయా లేదా పరిశీలించి, ఎలాంటి తప్పులు లేకుండా చూడాలని బి ఎల్ ఎ లకు సూచించారు. ప్రతి ఓటు విలువైనదని, ప్రజాస్వామ్య పరిరక్షణలో బి ఎల్ ఎల పాత్ర ఎంతో ముఖ్యమని కాట శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఓటర్ల జాబితా నుంచి అర్హులైన వ్యక్తులు తొలగించబడకుండా అప్రమత్తంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పలువురు బి ఎల్ ఎలు పాల్గొన్నారు.

## ముదిరాజ్ సంఘ భవన ప్రారంభోత్సవానికి ఆహ్వానం

**మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్‌కు ఆహ్వాన పత్రిక అందజేత**



**గుమ్మడిదల మున్సిపాలిటీ:** సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మున్సిపల్ కేంద్రంలో నూతనంగా నిర్మించిన ముదిరాజ్ సంఘం భవన ప్రారంభోత్సవ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్‌ను ముదిరాజ్ సంఘం నాయకులు ఆహ్వానించారు. ఈ నెల 19న నిర్వహించనున్న ప్రారంభోత్సవ వేడుకకు హాజరై విజయవంతం చేయాలని కోరుతూ మంగళవారం ఆహ్వాన పత్రికను అందజేశారు. సంఘం అధ్యక్షుడు కుంటి మల్లేష్ ఆధ్వర్యంలో సంఘం సభ్యులు చైర్మన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. నాయకులు శ్రీనివాస్ రెడ్డి, ఆంజనేయులు యాదవ్, సంఘం సభ్యులు కుంటి రవి, ఉషన్న రాజు, నల్తూరు సాయి తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛభారత్ కార్యక్రమంలో పాల్గొన్న బిజెపి జిల్లా అధ్యక్షురాలు: గోదావరి అంజిరెడ్డి

**సంగారెడ్డి జిల్లా:** సంగారెడ్డి జిల్లా పటాన్చెరు నియోజకవర్గం భారతి నగర్ డివిజన్లో జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజి రెడ్డి అధ్యక్షతన భారతి నగర్ డివిజన్ అధ్యక్షురాలు రజిని ఆధ్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 12 ఏండ్ల సుపరిపాలన సందర్భంగా భారతి నగర్ డివిజన్ లో స్వచ్ఛతా అభియాన్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది అలాగే స్థానిక అంబేద్కర్ విగ్రహం దగ్గర మొక్క నాటడం జరిగింది, భారతి నగర్ డివిజన్ లో ఉన్న బస్తి దవాఖాన ను సందర్శించి మెరుగైన వైద్యం అందించాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చేస్తున్న అభివృద్ధి పనులు గురించి తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమం లో భారతి నగర్ డివిజన్ అధ్యక్షులు రజిని సీనియర్ నాయకులు నందరెడ్డి, కృష్ణ మూర్తి, లక్ష్మణ్ గౌడ్ ,శరత్ రాఘవేందర్ రెడ్డి, రాజేశ్వరి ఇతర నాయకులు కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.



# అటవీ ప్రాంతమైనా అక్షరాస్యతలో ముందంజ

**విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ: రాష్ట్ర మంత్రి సీతక్క**






**ములుగు జిల్లా:** వెనుకబడిన, అటవీ ప్రాంత జిల్లాగా పేరొందిన ములుగు జిల్లా విద్యా రంగంలో రాష్ట్రానికి ఆదర్శంగా నిలుస్తోందని, విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం భవిష్యత్తుకు బలమైన పునాది వేయవచ్చని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో విద్యాశాఖ ఆధ్వర్యాన, రోటరీ క్లబ్ ఆఫ్ వరంగల్ సెంట్రల్ సహకారంతో జిల్లా వ్యాప్తంగా పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు 50 సైకిళ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు తో కలిసి హాజరై విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేశారు. అనంతరం మంత్రి సీతక్క మాట్లాడుతూ, ములుగు జిల్లా నిరక్షరాస్యత అధికంగా ఉన్న వెనుకబడిన జిల్లా అయినప్పటికీ జిల్లా అధికారులు, విద్యాశాఖ సిబ్బంది, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థుల సమిష్టి కృషి ఫలితంగా ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో 99.30 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలో మొదటి స్థానం, ఇంటర్మీడియట్ ఫలితాల్లో రాష్ట్రంలో రెండో స్థానం సాధించడం గర్వకారణమని పేర్కొన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తోందని, జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు రోటరీ క్లబ్ ఆఫ్ వరంగల్ సెంట్రల్ సహకారంతో 50 సైకిళ్లు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. కరోనా కాలం నుంచి ఇప్పటి వరకు మహిళలకు కుట్టు మిషన్లు, విద్యార్థులకు సైకిళ్లు తదితర సేవా కార్యక్రమాలతో సమాజానికి అండగా నిలుస్తున్న రోటరీ క్లబ్ సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. మారుమూల గ్రామాలు, అటవీ ప్రాంతాల్లో నివసించే విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లేందుకు ఈ సైకిళ్లు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. జిల్లాలో సేవా, సహాయ కార్యక్రమాలు, విద్యార్థుల భవిష్యత్తు తీర్చిదిద్దే కార్యక్రమాలు చేపట్టేందుకు ముందుకు వచ్చే స్వచ్ఛంద సంస్థలకు ప్రభుత్వం తరఫున పూర్తి సహకారం అందిస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వం చేపట్టిన "అమ్మకు అక్షరమాల" కార్యక్రమం రాష్ట్రంలో మహిళా అక్షరాస్యతకు కొత్త దిశానిర్దేశం చేస్తోందన్నారు. చదువురాని 12 లక్షల మంది మహిళా సంఘాల సభ్యులను గుర్తించామని, మొదటి విడతగా 6 లక్షల మందికి లిటరసీ పరీక్షలు నిర్వహించగా 83.33 శాతం మంది ఉత్తీర్ణత సాధించడం విశేషమన్నారు. ఇప్పుడు మరో 6 లక్షల మందిని పరీక్షలకు సిద్ధం చేస్తున్నామని, భవిష్యత్తులో వారందరినీ పదో తరగతి పరీక్షలకు కూడా సిద్ధం చేసే కార్యాచరణ చేపడుతున్నామని వెల్లడించారు. రాష్ట్రంలో నిరక్షరాస్యత లేకుండా ప్రతి మహిళను అక్షరాస్యత వైపు తీసుకెళ్లడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. విద్యార్థులు తమ తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చే దిశగా కష్టపడి చదవాలని, విద్యను కేవలం బట్టీ పట్టే విధంగా కాకుండా ప్రతి సబ్జెక్టును లోతుగా అర్థం చేసుకుని నేర్చుకునే అలవాటు పెంపొందించుకోవాలని సూచించారు.: జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు మాట్లాడుతూ, పదో తరగతి ఫలితాల్లో ములుగు జిల్లా రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలవడం సంతోషకరమని అన్నారు. ఇదే స్ఫూర్తితో రాబోయే విద్యా సంవత్సరంలో 100 శాతం ఉత్తీర్ణత సాధించే లక్ష్యంతో ప్రత్యేక కార్యాచరణ రూపొందించి ముందుకు సాగుతామని తెలిపారు. విద్యార్థులకు పాఠశాలల్లో ఉపాధ్యాయులు, ఇంటి వద్ద తల్లిదండ్రులు ప్రశాంతమైన వాతావరణం కల్పిస్తే విద్యాభ్యాసంపై మరింత దృష్టి పెట్టే అవకాశం ఉంటుందని చెప్పారు. జిల్లాలో విద్యా అభివృద్ధికి సహకరించే సంస్థలు మరింత ముందుకు రావాలని కోరుతూ, విద్యార్థులకు సైకిళ్ల పంపిణీకి ముందుకొచ్చిన రోటరీ క్లబ్ వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి, మున్సిపాలిటీ చైర్పర్సన్ చింతనిప్పుల చంద్రకళ, వైస్ చైర్మన్ ఆసియా షాహిన్, డీఈఓ సిద్ధార్థ రెడ్డి, డీఐఈఓ వీరేంద్ర కుమార్, రోటరీ క్లబ్ ప్రతినిధులు చంద్రమౌళి, గణేష్, ఇతర సభ్యులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## డాన్స్ పోటీల్లో డి.ఎస్.ఎస్.పి విద్యార్థుల సత్తా

- రాష్ట్రస్థాయి పోటీల్లో పలు బహుమతుల కైవసం
- గుమ్మడిదలకు గుర్తింపు తీసుకొచ్చిన విద్యార్థులు
- విద్యార్థులను అభినందించిన రాష్ట్ర నాయకులు గోవర్ధన్ రెడ్డి
- మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్



**గుమ్మడిదల మున్సిపాలిటీ:** సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలానికి చెందిన డి.ఎస్.ఎస్.పి డ్యాన్స్ అకాడమీ విద్యార్థులు వికారాబాద్ జిల్లా తాండూరులో జరిగిన రాష్ట్రస్థాయి డాన్స్ పోటీల్లో అద్భుత ప్రతిభ కనబర్చి పలు బహుమతులు సాధించారు. వివిధ విభాగాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు దక్కించుకుని గుమ్మడిదలకు గుర్తింపు తీసుకువచ్చారు. ముఖ్యంగా క్లాసికల్ డాన్స్ విభాగంలోనూ ద్వితీయ బహుమతి సాధించడం విశేషంగా నిలిచింది. అకాడమీ మాస్టర్ శివ శిక్షణలో పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు తమ ప్రతిభతో న్యాయనిర్ణేతలను ఆకట్టుకున్నారు. కఠోర సాధన, పట్టుదలతో రాష్ట్రస్థాయిలో విజయాలు నమోదు చేసి అకాడమీ ప్రతిష్ఠను మరింత పెంచారు. ఈ సందర్భంగా విజేత విద్యార్థులను సీజీఆర్ ట్రస్ట్ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్ అభినందించారు. విద్యార్థులు విద్యతో పాటు కళారంగంలోనూ రాణించడం ఆనందదాయకమని, తమ ప్రతిభను మరింత మెరుగుపరుచుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. డి.ఎస్.ఎస్.పి డ్యాన్స్ అకాడమీ మాస్టర్ శివ శిక్షణలో విద్యార్థులు సాధిస్తున్న విజయాలు అభినందనీయమని పేర్కొన్నారు. పోటీల్లో ఏ. యశస్విని, ఆకాంక్ష, హరిప్రియ, యశ్మిత, అనన్యలు ప్రథమ బహుమతులు సాధించగా, వరుణ్, సాయి, అశ్వత్, గణేష్, సిద్ధులు ద్వితీయ బహుమతులు అందుకున్నారు. అక్షయ, రుచిత, వర్షితలు తృతీయ బహుమతులు దక్కించుకోగా, క్లాసికల్ డాన్స్ విభాగంలో విద్య ద్వితీయ బహుమతి సాధించి ప్రత్యేక గుర్తింపు పొందింది. విజేతలను తల్లిదండ్రులు, స్థానికులు అభినందించారు.

## మంగంపేటలో ఉత్కంఠంగా సాగిన మండల స్థాయి క్రికెట్ ఫైనల్ రాళ్లకత్వ జట్టు ప్రతిభ

**గడ్డపోతారం జట్టు విజయం.. రన్న రప్ గా రాళ్లకత్వ టీం**

**చివరి వరకు పోరాడిన రాళ్లకత్వ క్రీడాకారులు**

**స్వల్ప తేడాతో పరాజయం అయిన ఆకట్టుకున్న ఆట తీరు**

**క్రీడా స్ఫూర్తిని చాటుకున్న రాళ్లకత్వ యువ ఆటగాళ్లు**



**జిన్నారం మున్సిపాలిటీ:** సంగారెడ్డి జిల్లా పటాన్చెరు నియోజకవర్గం లోని జిన్నారం మున్సిపల్ లోనిమంగంపేట్ గ్రామంలో నిర్వహించిన మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్ ఉత్కంఠభరితంగా సాగింది. ఫైనల్ పోరులో గడ్డపోతారం, రాళ్లకత్వ జట్లు తలపడగా గడ్డపోతారం జట్టు విజేతగా నిలిచింది. రాళ్లకత్వ జట్టు రన్నరప్‌గా నిలిచి తమ ప్రతిభను చాటుకుంది. మ్యాచ్‌లో రాళ్లకత్వ గ్రామ క్రీడాకారులు అద్భుతంగా రాణించి చివరి వరకు గెలుపు కోసం పోరాడారు. స్వల్ప తేడాతో పరాజయం ఎదురైనా క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించారు. టోర్నమెంట్ మొత్తం రాళ్లకత్వ జట్టు ఆటతీరు పలువురిని ఆకట్టుకుంది. యువ క్రీడాకారుల్లో ఉత్సాహాన్ని పెంచేలా ఈ పోటీలు జరిగాయి. క్రీడలు గ్రామీణ యువతలో ఐక్యత, ప్రతిభను వెలికితీసేందుకు దోహదపడతాయని నిర్వాహకులు తెలిపారు. విజేతలు, రన్నరప్ జట్లకు అభినందనలుతెలిపారు. మంగంపేట్‌లో ఉత్కంఠగా సాగిన మండల స్థాయి క్రికెట్ ఫైనల్గడ్డపోతారం జట్టు విజయంరన్నరప్‌గా రాళ్లకత్వ టీంచివరి వరకు పోరాడిన రాళ్లకత్వ క్రీడాకారులుస్వల్ప తేడాతో పరాజయం.. అయినా ఆకట్టుకున్న ఆటతీరుక్రీడా స్ఫూర్తిని చాటుకున్న రాళ్లకత్వ యువ ఆటగాళ్లు గ్రామీణ క్రీడాకారులకు వేదికగా నిలిచిన క్రికెట్ టోర్నమెంట్.

EDITED , PRINTED, PUBLISHED & OWNED BY PRINTED AND PUBLISHED BY MAHESH ETABONIA ON BEHALF OF NETI PRASTAVANAM MEDIA NETWORK , HNO-14-249/1/37 SAI NAGAR COLONY,MEDCHAL(V) MEDCHAL MALIKAJGIRI, -501401 at 14-249/1/37 Sai Nagar Colony, MEDCHAI, TELANGANA STATE , EDITOR : MAHESH ETABONIA :9908086026 Website : https://netiprasthanam.in/